సాక్షి
వరంగల్

శనివారం । 19 । జూలై । 2025



వరంగల్ జూలో శరణ్ షో షురూ..

వరంగల్ హంటర్‌రోడ్డులోని జూ పార్కులో వైట్ టైగర్(శరణ్) సందర్శకులను కనువిందు చేసింది. ఈ పులిని బోనులో నుంచి ఎన్‌క్లోజర్‌లోకి శుక్రవారం మంత్రి కొండా సురేఖ విడుదల చేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు తెల్లపులిని చూసి అబ్బురపడ్డారు.

- వివరాలు 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, శిక్షణ ఇచ్చేందుకు జిల్లా పరిధిలోని నిరుద్యోగ ట్రాన్స్‌జెండర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి సంక్షేమాధికారి పి.దివ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, బ్యుటీషియన్, జ్యూట్‌బ్యాగుల తయారీ, టైలరింగ్, లాజిస్టిక్స్ తదితర రంగాల్లో నైపుణ్య శిక్షణకు ఈనెల 23లోగా డబ్ల్యూడీఎస్‌సీ.తెలంగాణ.జీఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కాట్రపల్లి విద్యార్థులు



రాయపర్తి: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఝాన్సీలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 17న వరంగల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి సబ్ జూనియర్ స్విమ్మింగ్ పోటీల్లో వారు ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పదో తరగతి విద్యార్థులు గొలుసుల రేవంత్, ఎండీ అలియాజ్, బెల్లి శ్రీరామ్, లకావత్ చరణ్, తొమ్మిదో తరగతి విద్యార్థి ఎండీ అబ్దుల్ తాహెర్‌తోపాటు పీఈటీ పుట్ట సమ్మయ్యను అభినందించినట్లు హెచ్‌ఎం తెలిపారు కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ జి.రమ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన రేషన్‌కార్డులు మంజూరు

న్యూశాయంపేట: జిల్లాలో అర్హులకు నూతన రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ సత్యశారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 13 మండలాల్లో ఇప్పటివరకు మొత్తం 6,815 రేషన్‌కార్డులు మంజూరు చేయడంతోపాటు 26,766 మంది పేర్లు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులు స్వీకరించి, ఇంటింటికి వెళ్లి పరిశీలించినట్లు ఆమె తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

సంగెం: కుటుంబ కలహాలతో రైలు పట్టాలపై పడి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. స్థానికుల కథనం ప్రకారం.. కుంటపల్లి గ్రామానికి చెందిన జక్క వేణు కుటుంబ తగాదాలతో గురువారం రాత్రి ఇంట్లో భార్యతో గొడవపడి చింతలపల్లి రైల్వే గేట్ సమీపంలోని పట్టాలపై పడి ఆత్మహత్యకు యత్నించాడు. గేట్‌మెన్ గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంగెం పోలీసులు అమీర్‌బాబా, శ్రావణ్ వెంటనే వెళ్లి పట్టాలపై పడుకున్న వేణును కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వేణును కాపాడిన పోలీసులను ఎస్సై నరేశ్, ఉన్నతాధికారులు, గ్రామస్తులు అభినందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



నెక్కొండ: లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఉపేందర్ ఆస్పత్రిని శుక్రవారం ఏసీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డోర్నకల్ మండలం వెన్నారం గ్రామానికి చెందిన ఓ మహిళకు ఉపేందర్ ఆస్పత్రిలో ఇటీవల లింగనిర్ధారణ పరీక్షలు చేసినట్లు సమాచారం అందిందని చెప్పారు. ఇక్కడ లింగనిర్ధారణ పరీక్షలు చేయించుకున్న మహిళ ఖమ్మం పట్టణం ఖానాపురం హవేలి పరిధిలోని ఓ ఆస్పత్రిలో అబార్షన్‌కు వెళ్లిందని వివరించారు. విషయం తెలుసుకున్న ఖమ్మం డీఎంహెచ్‌ఓ విచారణ చేసి ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఖానాపురం హవేలి పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్‌ఐఆర్ నమోదైందని పేర్కొన్నారు. అక్కడి నుంచి నెక్కొండ పీఎస్‌కు కేసు బదలాయించారని ఆయన వివరించారు. దీంతో ఈ నెల 17న రాత్రి ఆస్పత్రిని నర్సంపేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులతో తనిఖీలు చేశారన్నారు. నెక్కొండ సీఐ శ్రీనివాస్, ఎస్సై మహేందర్‌తో కలిసి ఏసీపీ ఆస్పత్రిని కలియదిరిగారు. ఆస్పత్రి డాక్టర్ ఉపేందర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసి పరారీలో ఉన్న ఆస్పత్రి డాక్టర్ పార్థును త్వరలో అరెస్టు చేస్తామని ఏసీపీ తెలిపారు.

ఉపాధి అవకాశాలపై ఆశలు

చివరి దశకు కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు

- నెరవేరుతున్న జిల్లా ప్రజల చిరకాల స్వప్నం
- నేడు యూనిట్‌ను విజిట్ చేయనున్న కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- కొంతమంది రైతులకు అందని భూ పరిహారం.. స్థానికులకు ఉద్యోగ, ఉపాధి కల్పించేనా..?
- వీటిపై కేంద్రమంత్రులు స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్
- కాజీపేట డివిజన్ అంశాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లాలని రైల్వే నాయకుల నిర్ణయం



అయోధ్యపురంలో నిర్మాణమవుతున్న రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్



షెడ్ లోపలి భాగం



నిర్మాణంలో ఉన్న షెడ్ బయటి భాగం

కాజీపేట రూరల్: రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ.. ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాల కోరిక. అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా కార్యరూపం దాల్చిన కాజీపేట రైల్వే వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం 80శాతం పూర్తికావొచ్చింది. ఈ యూనిట్ ఏర్పాటుతో స్థానిక యువత ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై అనేక ఆశలు పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తోపాటు మరో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. శనివారం రైల్వే వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను సందర్శించనున్నారు.

వ్యాగన్‌షెడ్ టు మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్..

కాజీపేట మండలం అయోధ్యపురంలో 160 ఎకరాల్లో సుమారు రూ.786 కోట్లతో రైల్వే వ్యాగన్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణం చేపట్టారు. 2023 జూలై 8వ తేదీన ప్రధాని నరేంద్రమోదీ హనుమకొండ సుబేదారి ఆర్ట్స్‌కాలేజ్ గ్రౌండ్‌లో నుంచి కాజీపేట వ్యాగన్‌షెడ్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. 2023లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కాజీపేట రైల్వే మల్టీపుల్ యూనిట్‌గా ప్రకటన చేసి మంజూరు చేశారు. రీ డిజైనింగ్ చేసి జపాన్ టెక్నాలజీతో మల్టీపుల్ యూనిట్ రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌లో వ్యాగన్, కోచ్, వందేభారత్, ఎల్‌హెచ్‌బీ, మెము కోచ్‌లు తయారు చేస్తారు.

80 శాతం పూర్తయిన విభాగాలు..

యూనిట్‌లోని మెయిన్‌షాప్, పేయింట్ షాప్, స్టోర్ వార్డు, టెస్ట్ షాప్, క్యాంటీన్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎలక్ట్రిక్ సబ్‌స్టేషన్, సెక్యూరిటీ పోస్టు, రెస్ట్ హౌజ్, సేవగ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్/పంప్‌హౌజ్, టాయిలెట్ బ్లాక్స్, ప్యాకేజీ సబ్‌స్టేషన్, షవర్ టెస్ట్, రోడ్‌వే బ్రిడ్జి, పంప్‌హౌజ్/జీఎల్‌ఆర్, పిట్ ట్రావెర్సర్, వ్యాగన్ వే బ్రిడ్జి, గార్డు పోస్ట్/ట్రాక్ గేట్, ఆర్‌యూబీ, పార్కింగ్, పాండ్, (2000 కేఎల్ కెపాసిటీ), స్క్రాప్ బిన్స్ పనులు 80 శాతం పూర్తయ్యాయి.

పెండింగ్ పనులు..

రైల్వే కార్మికుల కోసం క్వార్టర్స్ నిర్మాణం, కోచ్‌ల తయారీకి షెడ్‌లలో మిషనరీ ఫిట్టింగ్, కనెక్టివిటీ రోడ్లు, ఎంట్రెన్స్ వద్ద రైల్వే వంతెన నిర్మాణం, ఇతరత్ర సివిల్ ఇంజనీరింగ్ పనులు జరగాల్సి ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేసి వచ్చే ఏడాది మార్చిలో యూనిట్‌ను ప్రారంభిస్తామని ఇప్పటికే దక్షిణమధ్య రైల్వే జీఎం శ్రీవాస్తవ ప్రకటించారు. వీటిపై దృష్టిపెట్టి త్వరగా పూర్తి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పంజాబ్ మాదిరి ఉద్యోగావకాశాలు..

కాజీపేటలోని కోచ్‌ఫ్యాక్టరీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మంది ఉపాధి లభించనుంది. అయితే ఈ ఉద్యోగాలు ఉమ్మడి జిల్లావాసులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పంజాబ్ కోచ్‌ఫ్యాక్టరీలో ప్రత్యేక జీఓ తీసి అక్కడి ప్రజలకు ఉద్యోగావకాశాలు ఇచ్చారు. అదేమాదిరిగా ఇక్కడ కూడా ఈ ప్రాంతం వారికి ఉద్యోగవకాశాలు కల్పించాలని, దీనిపై కేంద్రమంత్రులు స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

అయోధ్యపురంలో రైల్వే యూనిట్‌కు 112 మంది 160 ఎకరాల భూమి ఇచ్చారు. ఇద్దరు ఇళ్లు కోల్పోయారు. మొత్తం 114మంది నిర్వాసితులు ఉండగా ప్రభుత్వం ఎకరాకు రూ.8లక్షలు చెల్లించింది. ప్రభుత్వ విలువ ప్రకారం ఎకరాకు రూ.33 లక్షలు ఉండగా, ప్రభుత్వం రూ.8 లక్షలు రైతుకు ఇచ్చి, రూ.25లక్షలు దేవాదాయశాఖ(ఈ భూమి దేవాదాయశాఖకు సంబంధించి కావడం)కు ఇచ్చారు. 8మంది రైతుల భూమి సీలింగ్ ల్యాండ్ అని నష్టపరిహారం నిలిపివేశారు. ఇప్పటివరకు వారికి రాలేదు. కోట్ల రూపాయల విలువైన భూమి కోల్పోయామని, రైల్వే యూనిట్‌లో ఇంటికో ఉద్యోగం ఇచ్చి రైల్వేశాఖ ఆదుకోవాలని రైతులు కేంద్ర మంత్రులను కోరుతున్నారు.

రైల్వే మంత్రి దృష్టికి కాజీపేట డివిజన్ ప్రస్తావన..

రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్ దృష్టికి ముఖ్యంగా కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు అంశాన్ని తీసుకెళ్తామని స్థానిక రైల్వే నాయకులు తెలిపారు. అదేవిధంగా టౌన్ స్టేషన్ అభివృద్ధి, ఫాతిమానగర్‌లో ట్రయాంగిల్ స్టేషన్ నిర్మాణం, కాజీపేట రైల్వే ఆస్పత్రి సబ్ డివిజన్ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్, కాజీపేట రైల్వే స్టేషన్‌లో అదనపు ప్లాట్‌ఫాంల నిర్మాణం, అన్ని హంగులతో కూడిన రైల్వే క్లబ్ (ఇన్‌స్టిట్యూట్) భవనం, బెజవాడ తరహాలో రైల్వే ఎలక్ట్రిక్ ట్రెనింగ్ సెంటర్ ఏర్పాటు అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

కేంద్రమంత్రుల షెడ్యూల్..



అశ్విని వైష్ణవ్



కిషన్‌రెడ్డి

- శంకర్‌పల్లి రైల్వే స్టేషన్‌నుంచి ఎంఆర్ ప్రత్యేక రైలులో ఉదయం 11 గంటలకు బయలుదేరి 1:30 గంటలకు కాజీపేట రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు.
- 01:30 గంటలకు కాజీపేట రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి 01:45 గంటలకు కాజీపేట రైల్వే మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు చేరుకుంటారు.
- 02:45 గంటల వరకు యూనిట్‌ను విజిట్ చేస్తారు.
- అక్కడి నుంచి 3 గంటలకు బయలుదేరి కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు.
- 05:30 గంటలకు ఎంఆర్ ప్రత్యేక రైలులో కాచిగూడ రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి

దుగ్గొండి: ఉద్యోగులకు ఐదు పెండింగ్ డీఏలు చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో డీటీఎఫ్ సభ్యత్వ నమోదును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాచినపల్లి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్‌సీని వెంటనే నియమించి, పెరిగిన ధరల ప్రకారం చెల్లించాలని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని కోరారు. పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, సరిపడా ఉపాధ్యాయులను నియమించాలని సూచించారు. డీటీఎఫ్ మండల అధ్యక్షుడు రావుల దేవేందర్, ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు భద్రయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా చాంద్‌పాషా



చాంద్‌పాషా



మడిపెద్ది వెంకన్న

నర్సంపేట రూరల్: తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట గ్రామానికి చెందిన ఎండీ చాంద్‌పాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన మడిపెద్ది వెంకన్న ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఈ అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలను కోటీశ్వరులను చేస్తాం..

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్యశారద

నర్సంపేట: కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట సిటిజన్ క్లబ్‌లో శుక్రవారం ఇందిరా మహిళా శక్తి సంబురాలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన రేషన్‌కార్డులు, మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో 10,209 మందిని అదనంగా చేర్చి, 2,064 నూతన రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 6,968 స్వయం సహాయక సంఘాల్లో 73,969 మంది సభ్యులు ఉన్నారని, 5,045 అర్హత గల సంఘాలకు రూ.20.25 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, డీఎస్‌ఓ కిష్టయ్య, ఆర్డీఓ ఉమారాణి, నర్సంపేట మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, నెక్కొండ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, నర్సంపేట మార్కెట్ వైస్ చైర్మన్ హరిబాబు, సొసైటీ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై దృష్టి

- 'స్వచ్ఛభారత్ మిషన్ 2.0' నిధులు మంజూరు
- బయోమైనింగ్ వ్యర్థాల నిర్వహణకు అధికారుల ప్రణాళిక
- జీడబ్ల్యూఎంసీ, మున్సిపాలిటీల్లో మెరుగుపడనున్న సౌకర్యాలు



నర్సంపేటలో చెత్తను ట్రాక్టర్‌లో వేస్తున్న కార్మికులు



వర్ధన్నపేటలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

సాక్షి, వరంగల్: వరంగల్ నగరంతోపాటు నర్సంపేట, వర్ధన్నపేట మున్సిపాలిటీల్లో స్వచ్ఛతకు అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం నిధులు లేక ఇబ్బంది పడుతున్న కార్పొరేషన్, మున్సిపాలిటీలకు 'స్వచ్ఛ భారత్ మిషన్ 2.0' కింద 2025–26 సంవత్సరానికి నిధులు మంజూరయ్యాయి. వాటిని పకడ్బందీగా వినియోగించి చెత్త రహిత ప్రాంతాలుగా మార్చేందుకు అధికారులు దృష్టి సారించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.5,59,51,509, నర్సంపేట మున్సిపాలిటీకి రూ.6,30,215, వర్ధన్నపేట మున్సిపాలిటీకి రూ.3,16,518 నిధులు మంజూరయ్యాయి. కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం, నీటి వ్యర్థాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, బయోమైనింగ్ కార్యక్రమాల నిర్వహణతోపాటు బహిరంగ మల మూత్ర విసర్జన రహిత (ఓడీఎఫ్)గా ప్రకటించిన పట్టణాల ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజారోగ్య పరిరక్షణ కోసం పారిశుద్ధ్య కార్యక్రమాలు, యాస్పిరేషనల్ టాయిలెట్స్, జీవవైవిధ్య పరిరక్షణ, మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యర్థాల నిర్వహణకు ఈ నిధులు వినియోగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. 2021 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ పథకం ఈ ఏడాది అక్టోబర్‌తో ముగియనుంది.

రెండుసార్లు ప్రత్యేక నిధులు మంజూరు..

స్వచ్ఛభారత్ మిషన్ 2.0లో భాగంగా లక్షలోపు జనాభా కలిగిన పట్టణ, స్థానిక సంస్థలకు 2021 నుంచి ప్రతిఏటా రెండుసార్లు ప్రత్యేక నిధులు మంజూరవుతున్నాయి. ముఖ్యంగా నగరం, పట్టణాల్లో రోజురోజుకూ జనాభా పెరుగుతుండడంతో వ్యర్థాల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోంది. ఇప్పటికే వరంగల్‌లో బయోమైనింగ్ వ్యర్థాల నిర్వహణకు తగిన ప్రాధాన్యమిస్తూ బల్దియా అధికారులు పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నారు. తాజాగా స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో వరంగల్ నగరంతోపాటు నర్సంపేట, వర్ధన్నపేటలో బయోమైనింగ్ వ్యర్థాల నిర్వహణపై అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పుడు వచ్చిన నిధులతో ప్రజారోగ్య పరిరక్షణకు సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. ఈ నిధులు పూర్తిస్థాయిలో సరిపోవని, ఉన్న నిధులతో మెరుగ్గా ఉండేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు సంబంధిత అధికారులు అంటున్నారు. ఇదిలా ఉండగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో రాష్ట్రంలో తొలిస్థానం, జాతీయస్థాయిలో 84వ స్థానంలో నిలిచింది. ఇంటింటా చెత్త సేకరణ, బహిరంగ మల మూత్ర విసర్జన రహిత పట్టణంగా (ఓడీఎఫ్ ప్లస్) నర్సంపేట మున్సిపాలిటీకి రాష్ట్రంలో 77, జాతీయస్థాయిలో 768వ ర్యాంకు వచ్చింది. వర్ధన్నపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో 101వ ర్యాంకు, జాతీయస్థాయిలో 1,101వ ర్యాంకు వచ్చింది.

మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలి

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి కొండా సురేఖ, మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద

ఖిలా వరంగల్/వరంగల్ చౌరస్తా: మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలో చేపట్టిన వనమహోత్సవం, ఎల్బీనగర్‌లో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి సంబురాల్లో మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేర్వేరు కార్యక్రమాల్లో మంత్రి సురేఖ మొక్కలు నాటి, 100 మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.2.41 కోట్ల వడ్డీలేని రుణాలు, 98 సంఘాలకు రూ.12.46 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు, 2,690 మంది లబ్ధిదారులకు నూతన రేషన్‌కార్డులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్‌నెహ్రూ 1951 సంవత్సరంలో వనహోత్సవాన్ని చేపట్టారని గుర్తుచేశారు. తల్లి పేరు మీద మొక్కనాటాలని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విజ్ఞప్తి ప్రతిధ్వనిస్తోందని చెప్పారు. కార్యక్రమాల్లో మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎఫ్‌ఓ అనూజ్‌అగర్వాల్, డీసీఎస్‌ఓ కిష్టయ్య, డీఈఓ జ్ఞానేశ్వర్, అదనపు కమిషనర్ జోనా, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ రమేశ్, హెచ్‌ఎం శారదాబాయి, కార్పొరేటర్లు మహమ్మద్ పుర్ఖాన్, కావేటి కవిత, పల్లం పద్మ, గుండు చందన పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

- బంగారం, వెండి ఆభరణాల రికవరీ..
- వివరాలు వెల్లడించిన నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నెక్కొండ: తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న దొంగను అరెస్టు చేసినట్లు నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 26న మండల కేంద్రానికి చెందిన బండారి కొమురయ్య ఇంట్లో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఈ కేసును సీపీ.. సీసీఎస్ పోలీసులకు అప్పగించారని పేర్కొన్నారు. పలు దొంగతనాల్లో నేరస్తుడు ఆటో డ్రైవర్ బిర్రు రమేశ్‌బాబు యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం నెక్కొండ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో రమేశ్‌బాబును అదుపులోకి తీసుకుని విచారించగా బండారి కొమురయ్య ఇంటిలో దొంగతనానికి పాల్పడినట్లు తేలిందన్నారు. గతంలో జనగామ, నల్లగొండ టూ టౌన్ హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పలు దొంగతనాలు చేశాడని ఆయన వివరించారు. నిందితుడి నుంచి నెక్కొండలో చోరీ చేసిన 2 తులాల బంగారం, 33 తులాల వెండి, జనగామలో చోరీ చేసిన 6.6 తులాల బంగారం, 65 తులాల వెండి ఆభరణాలను రికవరీ చేశామని ఏసీపీ చెప్పారు. అనంతరం రికవరీ చేసిన సొత్తును బాధితులకు అందించామన్నారు. నెక్కొండ సీఐ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరోమారు కాంగ్రెస్ ప్రభుత్వమే..



రేషన్‌కార్డు మంజూరు పత్రాలను అందిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుకొండ: రాష్ట్రంలో మరోమారు కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జోస్యం చెప్పారు. కొనాయమాకులలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం ఆయన 294 మందికి కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు పత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. పరకాల, నర్సంపేట మాజీ ఎమ్మెల్యేలు సీఎం రిలీఫ్ ఫండ్‌ను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు, కల్యాణలక్ష్మి పథకం విషయంలో వసూళ్లకు పాల్పడితే కాంగ్రెస్ నాయకులను పార్టీకి దూరం చేస్తామని హెచ్చరించారు. అలాంటివి ఏమైనా జరిగితే తనకు నేరుగా ఫోన్ చేయాలని ఆయన సూచించారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి, జిల్లా పౌరసరఫరాల అధికారి సంధ్యారాణి, తహసీల్దార్ రియాజుద్దీన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ పాక శ్రీనివాస్, ఏపీఎం సురేశ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు చాడ కొమురారెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస్, జక్కుల సరిత, కొండేటి కొమురారెడ్డి, గోదాసి చిన్న తదితరులు పాల్గొన్నారు.

అధికారులను హడలెత్తించిన ఎమ్మెల్యే..

రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్యే అధికారులను హడలెత్తించారు. సంక్షేమ పథకాల సమాచారం ఇవ్వాలని ఆయన ఏపీఎం సురేశ్‌కుమార్, అధికారులను ఆదేశించారు. అప్పటికప్పుడు సమాచారం ఇవ్వలేక వారు ఇబ్బందులు పడ్డారు. పలు పథకాల గురించి ఎమ్మెల్యే ప్రశ్నించడంతో అధికారులు కంగుతిన్నారు. అయితే తన 'కొడుకు' సమాచారం ఇస్తాడంటూ పక్కనే ఉన్న వ్యక్తిగత పీఏ నుంచి ఆయన కొన్ని వివరాలను తీసుకుని మాట్లాడారు. అంతకు ముందు ఎమ్మెల్యే కొనాయమాకుల రైతు వేదిక వద్ద మొక్కలు నాటి, కొమ్మాల బస్టాండ్ వద్ద అంగడి కోసం రూ.52 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

యూరియా కోసం రైతుల బారులు



గోదాం వద్ద యూరియా కోసం బారులుదీరిన రైతులు

నర్సంపేట: యూరియా కోసం రైతులు బారులు తీరారు. యూరియా బస్తాలు వచ్చాయనే విషయం తెలుసుకున్న రైతులు చెన్నారావుపేట మండలం కోనాపురం గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్ద శుక్రవారం బారులుతీరారు. కొద్దిపాటి యూరియా బస్తాలను ఫీల్డ్‌ఆఫీసర్ వచ్చిన రైతులకు పంపిణీ చేశాడు. మిగిలిన రైతులు నిరాశతో వెనుదిరిగివెళ్లి పోయారు.

'ఔటర్' ప్రమాదం.. తీరని విషాదం

- హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదాలు
- ఇద్దరు మానుకోట జిల్లా వాసుల దుర్మరణం
- శోకసంద్రంలో తోటదస్రుతండా, మాసంపెల్లి తండాలు


జనార్దన్(ఫైల్)

గూడూరు: 'ఔటర్' ప్రమాదం.. తీరని విషాదాన్ని మిగిల్చింది. హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మానుకోట జిల్లా వాసుల దుర్మరణం చెందారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసంద్రంలో మునిగాయి. వివరాలు ఇలా ఉన్నాయి. గూడూరు మండలం తోటదస్రుతండాకు చెందిన గుగులోత్ జనార్దన్ (50), మహబ్బి దంపతులకు కూతురు సునీత సంతానం. సునీత హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ చదువుతోంది. కాగా, కూతురు చదువు దృష్ట్యా జనార్దన్, మహబ్బి దంపతులు రెండు నెలల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఓఆర్ఆర్‌పై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో జనార్దన్ మృతిచెందాడు. దీంతో తోటదస్రుతండాలో విషాదఛాయలు అలుముకున్నారు.

మరోఘటనలో..


చందులాల్(ఫైల్)

కొత్తగూడ : మండలంలోని మాసంపెల్లి తండాకు చెందిన మాలోత్ చందూలాల్(28) హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. చందూలాల్‌కు ఎనిమిదేళ్ల క్రితం దేవితో వివాహం జరగగా కుటుంబ పోషణ నిమిత్తం కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున నిద్రమత్తులో ఓఆర్ఆర్‌పై లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో చందూలాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో తండాలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఉపాధ్యాయుడిపై కేసు

హసన్‌పర్తి: ఫేక్ డాక్యుమెంట్‌తో ప్లాట్ విక్రయానికి కుదుర్చుకుని మోసం చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నగరంలోని లష్కర్‌బజార్‌కు చెందిన సయ్యద్ మసూద్ షరీఫ్ వడ్డేపల్లి శివారులోని సర్వే నంబర్ 370లో వరంగల్ కేఎంసీ ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు (ప్రస్తుతం మామునూరులోని పింఛన్‌పుర సబ్ జైల్ పాఠశాలలో) మజహర్ హుస్సేన్ వద్ద 201 చదరపు గజాల (ప్లాట్-38)కు రూ.44 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందుకుగాను జూన్‌లో రూ.9 లక్షలు అడ్వాన్స్ ఇచ్చాడు. మర్నాడు ప్లాట్ వద్దకు వెళ్లగా.. అక్కడ అగ్రిమెంట్‌లో పేర్కొన్న ప్లాటు కనిపించలేదు. ఈవిషయమై నిలదీయగా, జాప్యం చేస్తూ వచ్చాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. చివరికి బాధితుడు సుబేదారి పోలీసులను ఆశ్రయించాడు.

అభివృద్ధి చేస్తే పర్యాటక పురోగతి

జాలువారే జలపాతాలు.. నిషేధాలతో కనుమరుగుకానున్న అద్భుతాలు

- కర్రె గుట్టలను పర్యాటకంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం
- ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని పలు ప్రాంతాలు అభివృద్ధి చేస్తే దేశానికే తలమానికం

"ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలను కలుపుతూ వాజేడు మండలం వరకు పర్యాటకంగా తీర్చిదిద్దితే ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంది. ఈ రెండు జిల్లాల్లోని సందర్శన ప్రదేశాలను అభివృద్ధి చేస్తే దేశంలోనే పర్యాటకంగా మొదటి స్థానంలో ఉంటుంది.

–ఇటీవల వాజేడుకు వచ్చిన రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ధనసరి సీతక్క వ్యాఖ్యలు.

వీరి వ్యాఖ్యలు అమల్లోకి వస్తే ఈ రెండు జిల్లాలు పర్యాటకంగా పురోగతి సాధించి దేశానికే తలమానికంగా నిలుస్తాయి.

వాజేడు: ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం (కె) మండలాల్లో ఎన్నో జలపాతాలు ఉన్నాయి. అందులో బొగత జలపాతం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందగా మిగతా జలపాతాలు చిన్న చూపుకు గురవుతున్నారు. దీంతో వెలుగులోకి రావడం లేదు. నిర్మానుష్య అటవీ ప్రాంతం.. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని, రక్షణ లేదనే కారణాలతో ఈ అద్భుత జలపాతాల సందర్శనను అధికారులు నిషేధించారు. ఫలితంగా ఆ జలపాతాల సందర్శనకు పర్యాటకులు నోచుకోవడం లేదు. ఈ క్రమంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు దండకారణ్యంలోని కర్రె గుట్టలను కేంద్రం ప్రభుత్వం పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఇప్పటికే సన్నద్ధమైనట్లు సమాచారం. కర్రె గుట్టలు ఊటీ, కొడైకెనాల్ లాంటి పర్యాటక ప్రదేశాలను తలదన్నేలా ఉండడంతో కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిసింది. మావోయిస్టుల ఏరివేత కార్యక్రమం పూర్తయిన తర్వాత కర్రె గుట్టలను పర్యాటకంగా తీర్చిదిద్దనున్నట్లు సమాచారం. అక్కడే పెద్ద ఎత్తున పోలీస్ శిక్షణ కేంద్రం సైతం ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కర్రె గుట్టలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే అదే సమయంలో ప్రస్తుతం ములుగు జిల్లా వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో కర్రె గుట్టలను ఆనుకుని ఉన్నప్పటికీ పర్యాటకపరంగా నిషేధంలో ఉన్న అన్ని జలపాతాలు పూర్తి స్థాయిలో వెలుగు లోకి వచ్చే అవకాశం ఉంది. ఫలితంగా ఆయా జలపాతాలు శరవేగంగా అభివృద్ధి సాధించనున్నాయి. ఈ క్రమంలో వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లో ఉన్న జలపాతాల పేర్లు, వాటి వివరాలు, ప్రాముఖ్యతపై 'సాక్షి' ప్రత్యేక కథనం.


కర్రె గుట్టలు

ముత్యం ధార..



వెంకటాపురం(కె) మండలంలో ఉన్న ముత్యంధార జలపాతం అనతి కాలంలోనే ప్రసిద్ధి గాంచింది. అయినా పర్యాటకులు అక్కడికి వెళ్లొద్దని అధికారులు సందర్శను నిలిపివేశారు. కాగా, కర్రె గుట్టల వెంట ఇంకా చాలా జలపాతాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నా అవి వెలుగులోకి రాలేదు.

బొగత జలపాతం..



వాజేడు మండలం చీకుపల్లి సమీపంలో ఉన్న ఈ జలపాతానికి తెలంగాణ నయాగార, బాహుబలి జలపాతంగా పేరుంది. మండల కేంద్రానికి మూడు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. సెప్టెంబర్ వరకు ఉండే ఈ జలపాతం పర్యాటకులను ఆకర్షిస్తుంది.

భామన సిరి..



వాజేడు మండలం కృష్ణాపురం సమీపం మోడి కుంట ప్రాజెక్టు ప్రాంతంలో ఈ జలపాతం ఉంది. కడేకల్ గ్రామం నుంచి సుమారు 4 కిలో మీటర్లు అడవి నుంచి నడచి వెళ్తేనే ఈ జలపాతం వస్తుంది. ఇది ఇటీవలే వెలుగులోకి వచ్చింది. వర్షాల సమయంలోనే ఈ జలపాతం కనువిందు చేస్తుంది. అడవిలో నడచి వేళ్లే సమయంలో గైడ్ లేకపోతే దారి తప్పే అవకాశం కూడా ఉంది.

బిజినేపల్లి ..



వాజేడు మండలం బిజినేపల్లి సమీపంలోని గుట్టల వద్ద ఈ జలపాతం ఉంది. ఇది కూడా స్థానికులకు తప్ప ఇతరులకు తెలియదు. ఈ జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తున్నప్పటికీ వర్షాలు కురిస్తేనే కనిపిస్తుంది.

దుసపాటి లొద్ది..



వాజేడు మండలం కొంగాల గ్రామ సమీపంలో గుట్టల వద్ద ఈ జలపాతం ఉంది. మండల కేంద్రం నుంచి ఐదు కిలో మీటర్ల దూరంలో ఉంటుంది. కొంగాల నుంచి రెండు కిలో మీటర్ల మేర కాలి నడకన అటవీ ప్రాంతంలో నడచి వెళ్లాల్సి ఉంటుంది. వర్షాలు పడినప్పుడు మాత్రమే ఈ జలపాతం దర్శనమిస్తుంది.

మాసన్ లొద్ది..



వాజేడు మండలం దూలాపురం గ్రామ సమీపంలోని గుట్టలపై ఉంది. ఇక్కడికి చేరుకోవాలంటే నడక పరంగా కష్టపడాలి. వర్షాలు పడితేనే కనువిందు చేస్తుంది. ఈ జలపాతాన్ని చూడాలంటే గుట్టపైకి చేరుకోవాలి. సుమారు 10 కిలో మీటర్లు నడిస్తేనే ఈ జలపాతం వద్దకు వెళ్లగలం. దీంతో ఇంత వ్యయప్రాసలకు ఓర్చి ఇక్కడకు ఎందుకు వెళ్లడమని పర్యాటకులు భావిస్తుండడంతో ఈ జలపాతం ప్రచారంలోకి రాలేదు.

గుండం..

వాజేడు మండలం అరుణాచలపురం గ్రామ సమీపంలోని గుట్టల వద్ద గుండ జలపాతం ఉంది. అరుణాచలపురం నుంచి సుమారు రెండు కిలో మీటర్ల మేర పొలాల గట్లపై నడచి వెళ్తే ఇది కనిపిస్తుంది.

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

ఆ నినాదమే ప్రజల్లోకి తీసుకెళ్లాలి


- తెలంగాణ ప్రజలు పెనం నుంచి పొయ్యిలో పడ్డారు
- కేసీఆర్ స్కాంలకు కాంగ్రెస్ రక్షణ
- స్థానిక సంస్థల సన్నద్ధం వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్


మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

జనగామ: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల అభివృద్ధి చెందుతున్నాయని, ఆ నినాదమే ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు సొడ రమేశ్ అధ్యక్షతన జిల్లా కార్యాలయంలో జరిగిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సంక్షేమానికి దూరమైన ప్రజలు.. రేవంత్‌రెడ్డి చెప్పిన బూటకపు మాటలను నమ్మి మోసపోయారన్నారు. కాంగ్రెస్ అబద్ధపు హామీలను నమ్మి పెనం నుంచి పొయ్యిలో పడ్డారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజాసమస్యలు, అభివృద్ధిని పక్కన పెట్టి పరస్పరం బూతులు తిట్టుకోవడమే పనిగా పెట్టుకున్నాయన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా గెలిచేందుకు బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయన్నారు. గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తుంది కేంద్ర ప్రభుత్వమని, ఆ నినాదంతోనే స్థానిక సంస్థల్లో ప్రచార హస్తంగా వినియోగించుకుని, ప్రజలకు వాస్తవాలు వివరిస్తున్నామన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 19 నెలల పాలనలో ఆ వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. ఆరు గ్యారంటీలపై మీరు నిలదీయొద్దు, స్కాంల విషయంలో కేసీఆర్ కుటుంబాన్ని మేం అరెస్ట్ చేయబోమంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య లోపాయికారీ ఒప్పందం నడుస్తోందన్నారు. స్థానిక సంస్థల్లో బీజేపీని గెలిపిస్తేనే గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని ప్రజలు నిర్ణయానికి వచ్చారన్నారు. సమావేశంలో మాజీ మంత్రి గుండె విజయరామారావు, పట్టణ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, జిల్లా కన్వీనర్ ఆరుట్ల దశమంతరెడ్డి, రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్‌రెడ్డి, బొజ్జపల్లి సుభాశ్, మహంకాళి హరిచంద్రగుప్తా, పెద్దోజు జగదీశ్ పాల్గొన్నారు.

జూలో శరణ్ షో షురూ..

- మంత్రి సురేఖ చేతుల మీదుగా ఎన్‌క్లోజర్‌లోకి తెల్లపులి విడుదల
- జూపార్క్‌లో విద్యార్థుల సందడి ..



తెల్లపులిని ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేస్తున్న మంత్రి సురేఖ, బోను నుంచి ఎన్‌క్లోజర్‌లోకి వస్తున్న పులి

న్యూశాయంపేట : వరంగల్ హంటర్ రోడ్‌లోని కాకతీయ జువాలాజికల్ పార్క్‌లో వైట్ టైగర్(శరణ్, మగ, 13 ఏళ్ల వయసు) సందర్శకులను కనువిందు చేసింది. హైదరాబాద్ నెహ్రూ జువాలాజికల్ పార్క్ నుంచి తీసుకొచ్చిన తెల్లపులిని శుక్రవారం రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ.. పాఠశాల చిన్నారులతో కలిసి ఎన్‌క్లోజర్‌లోకి విడుదల చేశారు. అనంతరం జూపార్క్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్క నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జువాలాజికల్ పార్క్‌కు దీటుగా వరంగల్‌లోని కాకతీయ జూపార్క్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానన్నారు. రూ. కోటి వ్యయంతో పార్క్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. హరిత నిధి నుంచి రూ. 4.25 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. ఈ నిధులతో జూపార్క్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు జంతువులు జూపార్క్‌కు వచ్చాయని, త్వరలో ఫిమేల్ వైట్‌టైగర్‌ను తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సింహం, మరికొన్ని ఇతర జంతువులను తీసుకురానున్నట్లు వివరించారు. జూపార్క్‌లోని జంతువుల సంరక్షణకు జంతు ప్రేమికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

క్యూఆర్ కోడ్.. చాట్‌బాట్

జూపార్క్‌లోని జంతువుల వివరాలు తెలుసుకునేందుకు క్యూఆర్‌కోడ్, చాట్‌బాట్ సిస్టం అందుబాటులోకి తీసుకొచ్చారు. కాకతీయ జూపార్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు తెలుసుకోవచ్చు. కార్యక్రమంలో భద్రాద్రి సర్కిల్ సీసీఎఫ్ భీమా నాయక్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల అటవీశాఖాధికారి అనుజ్‌అగర్వాల్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ కృష్ణమాచారి, ఫారెస్ట్ రేంజ్ అధికారులు మయూరి, భిక్షపతి, ఎఫ్‌బీఓ శారద, తదితరులు పాల్గొన్నారు.

జలకాలాటలో..





ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ నీటిలో సేదదీరుతున్న తెల్లపులి

రూ.50.66 లక్షల విలువైన నల్లబెల్లం, పటిక పట్టివేత

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ రూరల్ పీఎస్ పరిధిలో భారీగా నల్లబెల్లం, పటిక, గుడుంబా పట్టుకున్నామని ఎస్సై వి.దీపిక శుక్రవారం తెలిపారు. ఎస్సై దీపిక కథనం ప్రకారం.. రెండో ఎస్సై రవికిరణ్ సిబ్బందితో కలిసి శనిగపురం శివారులోని చర్చి వద్ద వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో ఓ లారీ అనుమానాస్పదంగా వస్తోంది. ఆపి తనిఖీ చేయగా 250 బస్తాల నల్లబెల్లం (12,500 కిలోలు), 10 బస్తాల పటిక (500 కిలోలు), 40 లీటర్ల గుడుంబా లభించగా స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.50.66 లక్షలు ఉంటుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా నందిగామ డీవీఆర్ కాలనీకి చెందిన లారీ డ్రైవర్ పల్లపు ఉపేందర్ అదుపులోకి తీసుకుని విచారించగా తనతో పాటు బానోత్ మోహన్, బానోత్ కృష్ణ, గుగులోత్ నరేశ్‌తో కలిసి చిత్తూరు జిల్లాలో నల్లబెల్లం, పటిక కొనుగోలు చేశామని చెప్పాడు. లారీలో మహబూబాబాద్ జిల్లాకు తీసుకొచ్చి ఇక్కడి నుంచి మహబూబాబాద్, చిన్నగూడూరు, నెల్లికుదురు మండలాల్లో గుడుంబా తయారీదారులకు అమ్ముతున్నారు. ఈ ఘటనపై మహబూబాబాద్ రూరల్ రెండో ఎస్సై రవికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దీపిక తెలిపారు. కాగా, బానోత్ మోహన్, బానోత్ కృష్ణ, గుగులోత్ నరేశ్ పరారీలో ఉన్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

- తాడిచర్లలో ఘటన


ఓదెలు (ఫైల్)

మల్హర్: తోటలో పనిచేస్తున్న క్రమంలో విద్యుత్ తీగ తాకడంతో ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తాడిచర్ల గ్రామంలో జరిగింది. కొయ్యూరు ఎస్సై నరేశ్ కథన ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల ఓదెలు (76) రోజుమాదిరిగా శుక్రవారం ఉదయం ఇంటి సమీపంలోని తన కూరగాయల తోటకు నీరు పారించడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తోట వద్ద ఉన్న వైద్యుత్ తీగ తాకడంతో షాక్‌కు గురై కిందపడ్డాడు. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని చూడగా ఓదెలు చనిపోయి ఉన్నాడు. ఈ ఘటనపై మృతిడి కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ వెల్లడించారు.

ఐదునెలలుగా మృత్యువుతో పోరాడి ఓడిన వివాహిత..

- చికిత్స పొందుతూ మృతి
- భర్త, బావ, తోటి కోడలిపై కేసు నమోదు

కాజీపేట: అత్తింటి దాష్టీకంతో తీవ్రంగా కాలిన గాయాలతో దాదాపు 5 నెలలు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి ఓ వివాహిత మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి అన్న ఇమ్మడి విశ్వనాథ్ శుక్రవారం కాజీపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. మృతురాలి అన్న, పోలీసుల కథనం ప్రకారం.. ధర్మసాగర్ మండలం రాపాకపల్లికి చెందిన ఇమ్మడి సుమలత(38)కు కాజీపేటలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన ఇసంపెల్లి సునీల్‌తో 6 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు కుమారుడు సుహాస్ సంతానం. ఈ క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 27న సుమలతపై అత్తింటి కుటుంబీకులు టర్పెంట్ ఆయిల్ పోసి నిప్పు అంటించగా 80 శాతం శరీరం కాలింది. దీంతో చుట్టు పక్కల వారు ఆమెను వరంగల్ ఎంజీఎంలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ అయిదు నెలలు తీవ్రంగా కాలిన గాయాలతో నరకయాతన పడిన సుమలత గురువారం రాత్రి కన్నుమూసింది. భర్త ఇసంపెల్లి సునీల్, బావ సురేశ్, తోటి కోడలు స్వరూప కలిసి తనపై హత్యాయత్నం చేసినట్లు మృతురాలి వాగ్మూలం ఆధారంతోపాటు మృతురాలి అన్న విశ్వనాథం ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

పండుగపూట విషాదం..

- బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం
- పది మందికి పైగా గాయాలు
- ఐనపల్లిలో ఘటన


ఈరు(ఫైల్)

ఖానాపురం: పండుగపూట విషాదం నెలకొంది. ఎదురుగా వస్తున్న డీసీఎంను తప్పించబోయిన బైక్.. పండుగ వేడుకలో భాగంగా రహదారి పక్కన నృత్యం చేస్తున్న వ్యక్తిని ఢీకొనగా అతడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మరో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఖానాపురం మండలం ఐనపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో గురువారం తీజ్ పండుగ జరుపుకున్నారు. తీజ్ నిమజ్జనం సందర్భంగా గ్రామంలోని జాతీయ రహదారి పక్కన తండా వాసులు రాత్రి నృత్యం చేస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని బుధరావుపేటకు చెందిన యువకుడు కోడి రాకేశ్ బైక్‌పై గ్రామానికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో ఎదురుగా వచ్చిన డీసీఎం తప్పించబోయి పక్కనే పండగ వేడుకలో ఉన్న వాంకుడోతు ఈరు(45)ను ఢీకొట్టగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడితో ఆగకుండా బైక్ పక్కన ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. దీంతో ఈ ఘటనలో గుగులోత్ రమేశ్, భూక్య బాలు, భూక్య మౌనిక, గుగులోత్ గాయత్రీకి తీవ్ర గాయాలు కాగా మరో పదిమందికి స్వల్పగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనదారుడు రాకేశ్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఈరుతో పాటు మిగతా వారందరిని ఆస్పత్రికి తరలించగా ఈరు అప్పటికే మృతి చెందాడు. కాగా, నెక్కొండ మండలం దుబ్బతండాకు చెందిన ఈరు ఇరవై సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం ఐనపల్లికి వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో రెండు గ్రామాల్లో విషాదం అలుముకుంది. మృతుడికి భార్య బుజ్జి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎమ్మెల్యే దంపతులకు గాయాలు


సంఘటన స్థలంలో వాహనాలు


ప్రమాదంలో గాయపడిన మాజీ ఎమ్మెల్యే పుల్లయ్య

- నకిరేకల్ వద్ద ఘటన

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, నర్మద దంపతులు శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో పుల్లయ్య స్వల్పంగా, నర్మద తీవ్రంగా గాయపడ్డారు. పుల్లయ్య దంపతులు కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా మార్గమధ్యలోని నల్లగొండ జిల్లా నకిరేకల్ వద్ద జాతీయ రహదారిపై మరో కారు ఎదురుగా రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొట్టింది. దీంతో మాజీ ఎమ్మెల్యేకు చెందిన కియా కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. అదే సమయంలో మరో కారులో అటువైపు వెళ్తున్న మహబూబాబాద్‌కు చెందిన జాకీర్ ప్రమాద ఘటనను గమనించారు. వెంటనే తన వాహనాన్ని నిలిపి గాయపడిన మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, ఆయన భార్య నర్మదను చికిత్స నిమిత్తం నకిరేకల్ శివారులోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

తండ్రి మందలించాడనే క్షణికావేశంలో..

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు
- చికిత్స పొందుతూ మృతి


బాలకృష్ణ(ఫైల్)

దామెర: తండ్రి మందలించాడనే కారణంతో క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో చోటుచేసుకుంది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మోతె కుమార్ పెద్ద కుమారుడు బాలకృష్ణ (20) ఐటీఐ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కాగా, బాలకృష్ణ దుర అలవాట్లు నేర్చుకుంటున్నాడని తండ్రి ఇటీవల మందలించాడు. మనుసులో పెట్టుకున్న బాలకృష్ణ.. క్షణికావేశంలో ఈ నెల 11న పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన బంధువులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. ఈ ఘటనపై తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.